క్లుప్తంగా

సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

దేవరకొండ : దేవరకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈనెల 21న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొన దలచిన వారు టూ వీలర్ వాహనాలకు రూ.10వేలు, ఫోర్ వీలర్ వాహనాలకు రూ.30వేలు డిపాజిట్ చేసి 21వ తేదీ 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వేలంపాటలో ఎలాంటి వాహనాన్ని కొనని పక్షంలో డిపాజిట్ తిరిగి చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నల్లగొండ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్రంపోడు : మండలంలో సోమవారం, మంగళవారం 400 కేవీ విద్యుత్‌లైన్ దామరచర్ల థర్మల్‌ప్లాంట్ నుంచి చౌటుప్పల్ వరకు నూతన లైన్ ఏర్పాటు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఫీడర్ల వారీగా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో గుర్రంపోడు, పోచంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు. గృహ అవసరాలకు సింగిల్ ఫేస్ సరఫరా మాత్రమే ఉంటుందని తెలిపారు. అదే విధంగా కొప్పోలు, పిట్టలగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు త్రీ ఫేస్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ సమయంలో సింగిల్ ఫేస్ సప్లయి మాత్రమే ఉంటుందని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి వార్డు సభలు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హులైన లబ్ధిదారులకు ఎంపికకు ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు వార్డు సభలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21న 1వ వార్డు నుంచి 10వ వార్డు వరకు, 22న 11వ వార్డు నుంచి 20వ వార్డు వరకు, 23న 21వ వార్డు నుంచి 30వ వార్డు వరకు, 24న 31వ వార్డు నుంచి 40వ వార్డు వరకు, 25న 41వ వార్డు నుంచి 48వ వార్డులలో వార్డు సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వార్డు సభల్లో లబ్ధిదారుల ఆమోదం పొందుపరుచనున్నట్లు తెలిపారు. ఈ వార్డు సభలకు సిబ్బందిని కూడా నియమించడం జరిగిందన్నారు. ఈ వార్డు సభలను విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకులు పాతనబోయిన సురేష్ మాతృమూర్తి ఇటీవల పాముకాటుకు గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆదివారం తిరుమలగిరి మండల కేంద్రంలోని బాధితురాలు నివాసానికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగేండ్ల వెంకట్‌రెడ్డి నాయకులు రాంబాబు, వనమాలు, పాతనబోయిన బాస్కర్, మల్లయ్య యాదవ్, ప్రశాంత్, పెద్ద బాస్కర్, గోపి, నరేష్, నేతి శంకరయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మూలమలుపులు



బాలాజీ నగర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



దుగ్యాలకు వెళ్లే రోడ్డు మార్గంలో..

- కానరాని సూచిక బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. హైదరాబాద్‌-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు రోడ్డుకు చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని బాలాజీనగర్, దుగ్యాల, మల్లాపురం, వద్దిపట్ల, ఎర్రగుంటతండా, కేశంనేనిపల్లి, అజ్మాపురం, ఘనపురం, పెద్దగట్టు, పావురాలగట్టు, తిరుమలగిరి, అంగడిపేట, రంగారెడ్డిగూడెంలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు అధికంగా ఉండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో..



కేశంనేనిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఇలా..



అంగడిపేట గ్రామానికి వెళ్లే మార్గంలో..

రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మిర్యాలగూడ : ఈనెల 21న నల్లగొండ పట్టణంలో నిర్వహించే మహాధర్నాకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నందున అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందన్నారు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని, రైతు రుణమాఫీ కనీసం సగం మందికి కూడా కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని లేనట్లయితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఈనెల 21న నల్లగొండలో నిర్వహించే మహా ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మోసిన్‌అలీ, శ్రీనివాస్ రెడ్డి, చిట్టి బాబునాయక్, సంపత్, రంగారెడ్డి, హాతీ రాంనాయక్, మగ్దుంపాషా, ఇలియాస్‌ఖాన్, మట్టపల్లి సైదయ్య యాదవ్ పాల్గొన్నారు.

దేవరకొండ : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టేందుకు ఈనెల 21న నల్లగొండలో రైతుల పక్షాన బీఆర్ఎస్ నిర్వహించనున్న రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా ఎగ్గొట్టిన రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పల్లా ప్రవీణ్‌రెడ్డి, మాధవరం శ్రీనివాసరావు, టీవీఎన్ రెడ్డి, వెలుగూరి వల్లపురెడ్డి, రాజినేని వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, లోక్యా నాయక్, ముత్యపురావు, కేసాని లింగారెడ్డి, రవి, సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు సన్మానం

నల్లగొండ టౌన్ : లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసి 50 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులను క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కడిమి హరినాథ్ ఆధ్వర్యంలో జగిని భీమయ్య, కంబంపాటి కోటేశ్వర్‌రావు, అమరేందర్‌రావు, వెంకటపతిలను సన్మానించారు. అనంతరం క్లబ్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సునిల్‌కుమార్ రుమాల్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యారాల ప్రభాకర్ రెడ్డి, కే.వి.ప్రసాద్, గోలి అమరేందర్ రెడ్డి, తీగల మోహన్‌రావు, నేతి రఘుపతి, యానాల మోహన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వేమన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

రామగిరి (నల్లగొండ): ప్రజా కవి యోగి వేమన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవితా దోస్తాన్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేమన పద్యాల్లో ఎన్నో నైతిక విలువలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని చదవాలని కోరారు. కవితా దోస్తాన్ వ్యవస్థాపకుడు, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ నాటి సామాజిక సమస్యలపై యోగి వేమన తన పద్యాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు అలుగుబెల్లి రాంరెడ్డి, వైద్యులు శ్రీనివాస్, సైదిరెడ్డి, మురళీధర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్ట నాగయ్య, గ్రంథాలయ సిబ్బంది కుసుమ శ్రీ, మల్లేష్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఆదివారం దేవరకొండ మండలం శేరిపల్లి దుబ్బతండాకు చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో పట్టణంలోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ సిరాజ్‌ఖాన్,మారుపాకుల సురేష్‌గౌడ్,తుల్యానాయక్, శంకర్ నాయక్, పాపానాయక్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు



విధులకు హాజరైన పోలీస్ సిబ్బందితో ఆస్పత్రి సూపరింటెండెంట్

దేవరకొండ : కలెక్టర్ ఇలా త్రిపాఠి చొరవతో ఎట్టకేలకు దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటయ్యింది. ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్ లేకపోవడంతో ఎమ్ఎల్‌సీ(మెడికో లీగల్ కేసుల) సందర్భంతో పాటు ఆస్పత్రికి రాత్రి సమయాల్లో మద్యం సేవించి వచ్చే వారితో గతంలో ఇబ్బందులు తలెత్తేవి. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులతో పాటు సిబ్బంది, రోగులు సైతం ఇబ్బందులు పడేవారు. గత రెండు రోజుల క్రితం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేసిన సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ అవుట్ పోస్ట్ ఏర్పాటు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన హామీ మేరకు ఆమె జిల్లా ఎస్పీతో మాట్లాడి అవుట్ పోస్ట్ ఏర్పాటు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆదివారం ఇద్దరు పోలీసు సిబ్బంది ఆస్పతిలో విధులకు హాజరైనట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఆస్పత్రిలోని క్యాజువాల్టీ వద్ద 24గంటల పాటు పోలీసులు విధుల్లో ఉంటారని ఆయన తెలిపారు. పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుకు చొరవ తీసుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగ్తానాయక్, వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న వీరేపల్లి వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులకు 12గంటల పనిదినాలను పెంచి శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ఆరోపించారు. కేంద్రం వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమడాల పరుశురాములు, మాలోతు వినోద్‌నాయక్, పిలుట్ల సైదులు, సత్యనారాయణరావు, కోడిరెక్క మల్లయ్య, వేణుధర్ రెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరు గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రామలింగయ్య, సాయియాదవ్, పవన్, సంతోష్, నిఖిల్, రాముయాదవ్ ఉన్నారు.

బస్తీ దవాఖానాను అందుబాటులోకి తేవాలి

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో రూ.13లక్షలు వెచ్చించి ఆధునీకరించిన బస్తీ దవాఖానను ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 13నెలలు గడిచినా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన దవాఖానను ప్రారంభించలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు కూడా వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రిలో అమర్చిన ఫ్యాన్లు, విద్యుత్ సామగ్రి అపహరణకు గురవుతుందని, ఆరోగ్య శాఖ అధికారులైన పట్టించుకోవాలని మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రమేశ్‌జీ డిమాండ్ చేశారు. ఈయన వెంట చంద్రమౌళి, లక్ష్మణ్‌నాయక్, వీరయ్య, రాజు, శేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఏర్పాటు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, వేదికపై హాస్య నటుడు సంపూర్ణేష్‌బాబు

మిర్యాలగూడ అర్బన్ : ఫౌండేషన్ స్థాపించి దాని ద్వార సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జనమైత్రి ఫౌండేషన్ నాలుగో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలకు పోలీస్ శాఖ సహకారం ఉంటుందన్నారు. షీ టీంతో కలిసి ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న పలు అవగాహన కార్యక్రమాలు బాగున్నాని అభినందించారు. ఈ కార్యక్రమంలో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన సంపత్‌కుమార్, హాస్య నటుడు సంపూర్ణేష్ బాబు, సబర్దస్తి ఆర్టిస్ట్ వాసు, నర్ర లక్ష్మి, హైమావతి, హమీద్, వికాష్, వెంకట్రామ్‌నాయక్, దయాకర్‌రెడ్డి, శంకర్, జాజుల క్రిష్ణ, సుశ్రిత, రవి, వరలక్ష్మి, తాజ్‌బాబా, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరిక.. యువతలో క్రమశిక్షణ

నాగార్జునసాగర్ : ఎన్‌సీసీలో చేరడంతో యువతకు కమండర్‌షిప్, క్రమశిక్షణ, నాయకత్వం, లౌకిక దృక్పథం, సాహసం, నిస్వార్థ సేవ ఐక్యత లక్షణాలు చేకూరుతాయని సుబేదార్ ఛామ్‌కార్ తెలిపారు. రెండేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు వారు నేర్చుకున్న అంశాలపై ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఈ ఫలితాలను బట్టీ వారికి ఏ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కార్యక్రమంలో హవల్దార్ రాజు, ఏఎన్‌ఓ ఫణీంద్ర, సీటీఓస్ వెంకటేశ్, గణేష్, సింహాచలం, శ్రీవల్లీ ఉన్నారు .



విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

నియోజకవర్గ కన్వీనర్‌గా కిరణ్



నియామక పత్రం అందుకుంటున్న కిరణ్

కొండమల్లేపల్లి : బీసీ రాజ్యాధికార సమితి దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్‌గా కర్ణకంటి కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు నల్లగొండలోని బీసీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి ఆధ్వర్యంలో ఈ మేరకు కిరణ్‌ను ఎన్నుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగ పరంగా 42శాతం పోటీ చేసే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దాసరాజు జయరాజు, మల్లేష్‌గౌడ్, పరమేష్, నక్క వెంకన్న, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మిర్యాలగూడ : కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలునాయక్

మిర్యాలగూడ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఎంఈఓ బాలునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గాంధీపార్క్ పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల ఉద్యోగాలు సాధించవచ్చని, విద్యార్థినులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కురువ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మునగాల రాంరెడ్డి, కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు కోటయ్య, జయంతి, రమేష్‌నాయుడు, కిరణ్‌కుమార్, రత్నం, మనోహరి పాల్గొన్నారు.



పెద్దవూర : తంగెళ్లతండాలో క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న పాండురంగారెడ్డి

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

పెద్దవూర : క్రీడలతో గ్రామాలు, యువత మధ్య స్నేహభావం పెంపొందుతుందని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తంగెళ్లతండా, సుద్ద బావితండాలలో యువకులకు క్రికెట్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నాయకులు బుర్రి రాంరెడ్డి, చామల మధుసూధన్‌రెడ్డి, యాదయ్య, శ్రీనునాయక్, శ్రీధర్, వంశీ ఉన్నారు.

రాష్ట్ర సెక్రటరీగా నాజర్ అలీమీర్జా

మిర్యాలగూడ అర్బన్ : మానవ హక్కుల రక్షణ, సంక్షేమ అవగాహన సంస్థ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహ్మద్ నాజర్‌అలీ మీర్జాను నియమిస్తూ ఆ సంస్థ అధ్యక్షుడు మాధవాచారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం నియామక పత్రాలను అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం తాను చేస్తున్న కృషిని గుర్తించి నన్ను రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ యూత్ ప్రెసిడెంట్ మొహమ్మద్ పర్వేజ్, కొండల్ గౌడ్, అఖిల్, శ్రీరాములు, పూర్ణ, బిక్షం, గోవర్ధన్ తదితరులున్నారు.



నియామక పత్రం అందుకుంటున్న అలీమీర్జా

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



త్రిపురారం : సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు



కొండమల్లేపల్లి : విజయ మేరీ పాఠశాలలో..

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-1993 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం ఆనాటి ఈనాటి ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, సత్రమణ్యం, షేక్ జానీమియా, జాఫర్, సాగర్ రావు, సూర్యనారాయణ రెడ్డి, కలిమెల నాగయ్య, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు తూటిపల్లి తిరుపతయ్య, చాగంటి సత్యం, వెంకటాచారి, ప్రమీలా, జయమ్మ, గీత, జ్యోతి, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

విజయ మేరీ పాఠశాలలో..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని విజయ మేరి పాఠశాలలో 2000-2001 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. తన తోటి స్నేహితులతో తమ పాఠశాల నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, నాగయ్య, మల్లిఖార్జున్, కొండల్, జీవన్‌సింగ్, ఉపాధ్యాయులు వరదారెడ్డి, జాజిరెడ్డి, అంజయ్య, జోసెఫ్, నర్సిరెడ్డి, రజిత, వసంత, విజయలక్ష్మి పాల్గొన్నారు.